
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 25 జూలై 2024

ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ 8
ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి 8



రైతు బీమాతో..భరోసా

- కొత్త పట్టాదారులకు అవకాశం
- ఆగస్టు 5లోగా దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో గత యేడాది 1,32,486 రైతులకు బీమా
- కొత్తగా సుమారు 9,956 కుటుంబాలకు ప్రయోజనం

రైతు బీమా అమలు ఇలా...

జిల్లాలో 2018 సంవత్సరం నుంచి 2023 సంవత్సరం వరకు రూ. 210.45 కోట్ల రైతు బీమాను 4,209 రైతు కుటుంబాలకు అధికారులు అందించారు. ఇందులో 2018 సంవత్సరంలో 97,166 మంది రైతు బీమా కొరకు నమో దు చేసుకోగా 572 మందికి రూ. 28.6 కోట్ల బీమాను అందించారు. 2019 సంవత్సరంలో 1,21,675 మంది నమోదు చేసుకోగా 603 మందికి రూ. 30.15 కోట్లు, 2020 సంవత్సరంలో 1,21,023 మంది నమోదు చేసుకోగా 970 మందికి రూ. 48.5 కోట్లు, 2021 సంవత్సరంలో 1,34,098 మంది నమోదు చేసుకోగా 754 మందికి రూ. 37.07 కోట్లు, 2022 సంవత్సరంలో 1,24,285 మంది నమోదు చేసుకోగా 705 మందికి రూ. 35.25 కోట్లు, 2023 సంవత్సరంలో 1,32,486 మంది నమోదు చేసుకోగా 605 మందికి రూ. 30.25 కోట్లు రైతు బీమాను అధికారులు అందించారు.

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా పథకంలో చేరడానికి దరఖాస్తులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు, గతంలో బీమా పథకంలో ఉండి నామినీ చనిపోయిన వారు, ఆధార్ కార్డులో తప్పులున్న వారు సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి మార్గ దర్శకాలు జారీ చేశారు. గ్రామాల వారీగా నిర్దేశిత గడువులోగా కొత్త పట్టాలు పొందిన వారి జాబితాను ప్రకటించింది. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు, విస్తీర్ణాధికారులకు అప్పగించారు. వారి సమక్షంలో నామినీ పేరుతో రైతు దరఖాస్తుపై సంతకం చేసి అందివ్వాల్సి ఉంటుంది.

జూన్ 28వ తేదీలోపు పట్టాలున్న వారికే...

కొత్తగా పట్టాలు పొందిన వారు ఇదివరకు బీమా పథకంలో లేకుంటే ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పట్టా జూన్ 28వ తేదీలోపు రిజిస్టర్ ఉండాలి. బీమా పరిధిలోకి రావాలంటే 1965 ఆగస్టు 14, నుంచి 2006 ఆగస్టు 14 మధ్య పుట్టిన వారై ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎల్ ఐసీ బీమా నిబంధనల ప్రకారం ఆధార్ కార్డులో 18 నుంచి 59 సంవత్సరాలలోపు ఉండాలని సిబ్బందికి సూచించారు.

కావాల్సిన పత్రాలు..

దరఖాస్తుతో పాటు అవసరమైన పత్రాలను సైతం వ్యవసాయ శాఖ ప్రకటించింది. దరఖాస్తు పత్రం, రైతు, నామినీ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం కానీ తహసీల్దార్‌తో డిజిటల్ డీఎస్ పేపర్ కానీ సమర్పించాల్సి ఉంటుంది. ఆగస్టు 5వ తేదీ నాటికి వివరాల నమోదు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆగస్టు పదో తేదీ నాటికి ఎల్ఐసీకి జాబితాను వ్యవసాయ శాఖ అప్పగించనుంది.

ఆగస్టు 14వ తేదీతో 2023-24 సంవత్సరపు పాలసీ గడువు ముగియనుండడంతో కొత్తగా పాలసీ చేయనున్నారు. 2024-25 ఫార్మర్ గ్రూప్ ఇన్సురెన్స్ స్కీమ్‌లో కొత్త రైతులను చేర్చడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఐదు ఎకరాలలోపు ఉన్న పాత పట్టాదారులు, గతంలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ నమోదు చేసుకోని ఐదు ఎకరాలకు మించి ఉన్న పట్టాదారుల వివరాలను నమోదు చేయడానికి సైతం ఆగస్టు 5వ తేదీ గడువుగా ప్రభుత్వం విధించింది.

జిల్లాలో మండలాల వారీగా కొత్త పట్టాదారులు ఇలా...

జిల్లా వ్యాప్తంగా కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలను పొందిన రైతుల జాబితాను వ్యవసాయ శాఖ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 9,956 మంది కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు న్నట్లుగా లెక్క తేల్చింది. బీర్‌పూర్ మండలంలో 119 మంది రైతులు, బుగ్గారం 323, ధర్మపురి 535, గొల్లపల్లి 656, ఇబ్రహీంపట్నం 601, జగిత్యాల 230, జగిత్యాల రూరల్ 742, కొడిమ్యాల 693, కోరుట్ల 561, కథలాపూర్ 484, మల్లాపూర్ 605, మల్యాల 504, మేడిపల్లి 716, మెట్‌పల్లి 774, పెగడపల్లి 588, రాయికల్ 580, సారంగపూర్ 280, వెల్గటూరు 429, ఎండపల్లి 536 మంది రైతులు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలను పొందినట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది.

వివరాలను నమోదు చేస్తాం

వాణి, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల



జిల్లాలో పక్కాగా కొత్త పట్టాదారుల వివరాలను రైతు బీమా కొరకు నమోదు చేస్తున్నాం. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఏఓలు, ఏఈఓలు రైతుల వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతు వివరాలను నమోదు చేస్తున్నాం. రైతులు ముందుకు వచ్చి వివరాలను ఏఈఓ, ఏఓలకు అందించాలి.

బీడీ కార్మిక పిల్లలకు ఉపకార వేతనాలు

- బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు



మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల, జూలై 24: బీడీ కార్మికుల పిల్లల ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీడీ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు. బుధవారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో కోరుట్ల డివిజన్ బీడీ కార్మిక సంఘ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీడీ కార్మికుల పిల్లలకు 2024 - 25 సంవత్సరానికి కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ద్వారా తెలుగాణ రాష్ట్రంలోని బీడీ కార్మికుల పిల్లలకు బీడీ స్కాలర్‌షిప్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివుతున్న విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు స్కాలర్‌షిప్ కోసం ఆగష్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ, ఇంటర్, ఐటీఐ లేదా ఏదైనా ప్రొఫెషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆన్‌లైన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా మల్యాల రోడ్డు


రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

మల్యాల, జూలై 24: మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మల్యాల మండల కేంద్రానికి వెళ్లే రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. గుంతలతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రహదారికి మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు

ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు పంపిణీ చేయాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాల పంపిణీ చేయాలని, జిల్లాలో రానున్న ఆగస్టు 15 నాటికి రూ. 50 కోట్ల రుణాలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నందున అర్హులైన వినియోగదారులను వెంటనే గుర్తించాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శక్తి పథకం కింద రుణాలను మంజూరు చేయుటకు యూనియన్ బ్యాంక్ అధికారిణి అరుణ సవిత ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ అన్ని బ్రాంచీల మేనేజర్లు, సీఆర్పీ, మెప్మా బృందాలతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలాలవారీగా పురోగతి, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడానికి మహిళలకు రుణాలు సులభతరం చేయాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలకు వివిధ యూనిట్లతో పాటు అదనంగా రైస్ మిల్లుల యూనిట్లను గుర్తించేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఏజీఎమ్ కోటయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్ రావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్, జూలై 24: ఈ నెల 25 గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏఈ జమీల్‌పాషా తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సిరికొండ, దూలూరు, దుంపెట, పోసానిపేట గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేయూతనందించేందుకే మహిళాశక్తి పథకం

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల టౌన్ , జూలై 24: మహిళలను ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంతో పాటు చేయూతనందించేందుకే ప్రభుత్వం మహిళాశక్తి పథకాన్ని అమలు చేస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో రిసోర్స్ పర్సన్లకు మహిళాశక్తి పథకంపై అవగాహన కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్ గౌతంరెడ్డితో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి క్యాంటీన్‌లతో పాటు, స్త్రీ నిధి లింకేజీ ద్వారా నిధులు సమకూర్చి ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న ఏడాది కాలంలో రూ.11 కోట్ల రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుని మహిళలను కోటీశ్వరులుగా తయారు చేస్తామన్నారు. సంఘాలలో లేని మహిళలను గుర్తించి వడ్డీలేని రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రఘువరన్, కమిషనర్ సమ్మయ్య, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎం దివ్య భారతిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. హైద్రాబాద్‌లో పనిచేస్తున్న హబీబ్‌ను జగిత్యాల డీఎంగా నియామకం చేశారు. జగిత్యాలతో పాటు కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల డీఎంగా హబీబ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు మార్క్‌ఫెడ్ అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు బాధ్యతలు తీసుకున్న హబీబ్ మర్యాద పూర్వకంగా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిశారు.

టీఎస్ పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం


సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బీర్‌పూర్,జులై 24: టీఎస్ పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం సాధ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ఆనందరావ్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, తుంగూర్, కొల్వాయి, నర్సింహులపల్లి ఉన్నత పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, కార్యదర్శి సంఘ కుమారస్వామి, నవీన్, రాష్ట్ర బాధ్యులు బీస్కుర్‌రెడ్డి, సత్యరాజ్, నరసింహమూర్తి, సుదర్శన్, నరేష్, నాగరాని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

రాయికల్, జూలై 24: రాయికల్ బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు ఇటీవల వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకోగా బుధవారం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుర్మ మల్లారెడ్డి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిప్పిరెడ్డి రాజశేఖర్, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, సతీష్ రెడ్డి, ఏనుగు జితేందర్, అనుపురం నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరమ్మ తల్లి బోనాలు


నెత్తిన బోనాలతో మహిళలు


పూజలు నిర్వహిస్తున్న చైర్ పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్ , జూలై 24: జిల్లా కేంద్రంలో బుధవారం వీరమ్మ తల్లి బోనాల పండుగను రజక సంఘం ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని వేడుకల్లో పాల్గొన్నారు. మడేలేశ్వర స్వామి ప్రతిమతో పట్టణంలోని కొత్త బస్టాండ్, టవర్, తీన్‌ఖని మీదుగా మంచినీళ్ల బావి వరకు మహిళలు నెత్తిన బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి వేడుకల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రజక సంఘం నాయకులతో కలిసి మడేలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు దేవరాజు, శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు. అలాగే బేడ బుడగ జంగాల కాలనీ వాసులు పోచమ్మ తల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో చైర్ పర్సన్ అడువాల జ్యోతి కౌన్సిలర్ మల్లవ్వ తిరుమలయ్య ఉన్నారు.

జిల్లాలో పలుప్రాంతాల్లో వర్షం

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సగటున 15.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. అత్యధికంగా మెట్‌పల్లిలో 20.2 మిల్లీమీటర్లు, కోరుట్లలో 19.7, అత్యల్పంగా ధర్మపురిలో 11.2 మిల్లీ మీటర్లు, పెగడపల్లిలో 11.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని కథలాపూర్ 19.0, బీమారం 17.8, ఇబ్రహీంపట్నం 17.7, రాయికల్ 17.6, బీర్‌పూర్ 17.3, జగిత్యాల రూరల్ 16.7, జగిత్యాల 16.6, సారంగపూర్ 16.1, మల్లాపూర్ 15.8, మల్యాల 15.3, గొల్లపల్లి 14.2, కొడిమ్యాల 13.6, బుగ్గారం 12.7, ఎండపల్లి 12.6, వెల్గటూరు 11.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వరసగా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతోంది. పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలను అధికారులు సందర్శించి పరిశీలిస్తున్నారు. వర్షం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు.

రాయికల్ మండలంలో 11 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

రాయికల్, జూలై 24: రాయికల్ మండలంలో 11 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో చిరంజీవి బుధవారం తెలిపారు. ధర్మాజీపేట గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ మేడిపల్లి మండలం వెంకట్రావుపేటకు, ఇటిక్యాల గ్రామ కార్యదర్శి రాజేష్ కుమ్మరిపల్లికి, ఒడ్డెలింగాపూర్ కార్యదర్శి కవిత శ్రీరాంనగర్‌కు, శ్రీరాంనగర్ కార్య దర్శి రమ్యకృష్ణ ఆలూరుకు బదిలీ అయ్యారు. అలా గే కట్కాపూర్ గ్రామ కార్యదర్శి రాజేష్ కుమార్ ఇటిక్యాలకు, ఆలూరు గ్రామ కార్యదర్శి రాజశ్రీ కట్కాపూర్‌కు, కుమ్మరిపల్లి గ్రామ కార్యదర్శి గీతా రాణి దావన్‌పెల్లికి, అల్లీపూర్ కార్యదర్శి రాజేష్ కొత్తపేటకు, జగన్నాథ్‌పూర్ గ్రామ కార్యదర్శి అశోక్ మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు, దావన్‌పెల్లి కార్యదర్శి విజయ్ మేడిపల్లి మండలం రంగాపూర్‌కు, కొత్తపేట కార్యదర్శి మౌనిక జగన్నాథ్‌పూర్ గ్రామానికి బదిలీ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జగిత్యాల టౌన్ జూలై 24: వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జగిత్యాలలో బుధవారం వేకువజామున పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చైర్ పర్సన్ తనిఖీ చేశారు. నాలాల్లో పేరుకపోయిన సిల్ట్‌ను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తడి. పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు మారుతి, అశోక్, రాము, శంకర్ తదితరులు ఉన్నారు.

ఈత చెట్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాల రూరల్, జూలై 24 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనే వ్యక్తి గత కొన్నిరోజుల క్రితం ఎస్సారెస్పీ భూమిలో నాటిన 150 ఈత చెట్లను ధ్వంసం చేశాడని ఎస్సై సధా కర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన ఈత చెట్లను తొలగించిన తిరుపతిరెడ్డిపై జగిత్యాల రూరల్ ఎంపీడీఓ బుధవారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతిరెడ్డిపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

- 52.1గ్రాముల బంగారం, 55 గ్రామాలు వెండి ఆభరణాలు
- ద్విచక్ర వాహనం, మొబైల్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 24: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై చిరంజీవితో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్‌లు అనే ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ఈనెల 12న ఇంటికి తాళం వేయగా దానిని ఇనుప రాడ్‌తో పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరవాలో దాచుకన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే ఇద్దరు దొంగలు ఈ నెల 22న ఇబ్రహీంపట్నం శివారులో మహిళను కత్తితో బెదరించి మెడలోని తాళి ఎత్తుకెళ్లారు. బాధితు రాలు ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ ఆదేశాల మేరకు మెట్ పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి సుమారు రూ. 4 లక్షల విలువ గల 52.1గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్, జూలై 24: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో వరకట్నం వేధింపులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన ఎనగంటి రేఖ (25)కు ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెకు చెందిన అంజనేయులుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అంజనేయులు తరచూ తాగివచ్చి గొడవకు దిగేవాడు. అదనంగా కట్నం తేవాలని వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. రేఖ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 24: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడని రెండో టౌణా హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. కరీంనగర్ మతాశిశు ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 15న స్పృహ తప్పిపడి పోగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రెండో టౌణా సీఐ 8712670762 లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జగిత్యాలరూరల్, జూలై 24: జగిత్యాల రూరల్ మండ లం మోరపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రాజు (45) గ్రామ శివారులోని చెరువులోకి తన తమ్ముడు గణేష్‌తో కలిసి బుధవారం చేపల వేటకు వెళ్లారు. విద్యుత్ వైర్లతో చేపలుపడుతున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యకేతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి..

జ్యోతినగర్, జూలై 24: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి లోని మాతంగి కాలనీలో మంగళవారం రాత్రి తుంగపిండి రాజమ్మ (55)పై ఇంటి పక్కనే ఉంటున్న మేకల సమ్మయ్య గొడ్డలితో దాడి చేశాడు. రాజమ్మను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన లారీ

శంకరపట్నం, జూలై 24: మండలం కేశవపట్నంలో ఓ లారీ అదుపు తప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది. మండలంలోని కరీంపేటకు వెళ్తున్న లారీ కేశవపట్నంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది.

బస్సులో రూ. రెండు లక్షలు లభ్యం

పోలీసులకు అప్పగించిన యువకులు



హుజూరాబాద్‌లో ఎస్ఐ హైమద్‌అలీకి నగదును అందజేస్తున్న యువకులు

హుజూరాబాద్, జూలై 24: బస్సులో లభించిన రెండు లక్షల రూపాయలను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు ఇద్దరు యువకులు. బుధవారం పరకాల నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి రెండు లక్షల రూపాయలు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయాడు. అదే బస్సులో బెజ్జంకికి చెందిన విలసాగరం ప్రమోద్, రేగొండకు చెందిన మొర ఉదయ్‌కుమార్ అనే యువకులు ప్రయాణిస్తున్నారు. బస్సులో సీటుపై ఉన్న బ్యాగ్‌ను చూడగా అందులో రెండు లక్షలు రూపాయలు కనిపించాయి. వారు ఆ నగదును తీసుకెళ్లి హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ హైమద్‌అలీకి అప్పగించారు. ఎస్ఐ హైమద్ అలీ ప్రమోద్, ఉదయ్‌కుమార్‌లను అభినందించారు. విచారణ జరిపి బ్యాగ్ మరిచిపోయిన వ్యక్తికి నగదును అందజేస్తామని ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేష్‌నగర్, జూలై 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ బుధవారం విడుదల చేశారు. బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు ఒకటి నుంచి 8వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలు..

శాతవాహన యూనవర్సిటీ పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్ లా పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్లు (సప్లిమెంటరీ) పరీక్షలు ఆగస్టు 1 నుంచి 9వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

శిథిలావస్థలో.. వేద పాఠశాల భవనం



పురాతన భవనంలో కొనసాగుతున్న రాజరాజేశ్వర వేద పాఠశాల

- విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు
- వసతులు కల్పిస్తే పెరగనున్న సంఖ్య
- నూతన వేద పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్



ర్యాక్‌లపైన విద్యార్థుల దుస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 24: వేములవాడలోని వేద పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందిక రంగా మారింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో జూన్ 2018 లో వేద, ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో రాజ రాజేశ్వర వేద పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికతను పెంపొం దించేందుకు పండితులు వేద విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. చిన్నారులు హిందూ ధర్మ పరిరక్షణకు నిమగ్నమై ఉచ్చరించే మంత్రాలు చుట్టుపక్కల నిత్యం ప్రతిధ్వనిస్తున్నాయి. వేదానికి ఊపిరినిచ్చే పాఠ శాల శిథిలావస్థకు చేరుకుంటోందని, నూతన భవనం నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు వేద పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఋగ్వేదం 9, యజుర్వేదం 8, సామవేదం 7, అధర్వణ వేదం 5, స్మార్తం 1 హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉండగా మరో స్మార్తం, వేదం చదివే ఐదుగురు విద్యార్థులు ఇంటి నుంచి వస్తున్నారు. బీహార్ నుంచి ఒక విద్యార్థి, మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ము గ్గురు విద్యార్థులు వేములవాడ వేద పాఠశాలలో వేదా లను చదువుతున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

పురాతన భవనంలో వేదపాఠాలు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయం జీ ప్లస్ వన్ అంతస్థుల పురాతన భవనంలో కొనసాగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లో ఒకే చోట విద్యార్థులకు విద్యాబోధన చేపడుతున్నారు. మొదటి అంతస్థులో విద్యార్థులకు కిచెన్ సామగ్రి ఏర్పాటుకు, భోజనశాల, విద్యార్థులు దుస్తులు భద్రపరుచుకునేందుకు వాడుతున్నారు. విద్యాబోధన చేస్తున్న గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లోనే విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రిస్తున్నారు. విద్యార్థులు మంత్రాలను కంఠస్తం చేయాల్సి ఉన్నందున విడివిడి గదులు ఉండాల్సి ఉండేది. గదులు లేకపోగా ఒక హాల్ లోనే విద్యార్థులు విద్యాబోధన చేయడంతో ఇబ్బందికరంగా మారుతోంది.

వేద పాఠశాల నిర్మాణానికి ప్రణాళిక

ఆంజనేయశర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వేదపాఠశాల, వేములవాడ.




వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టులో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు వేదాలకు నలుగురు వేద పండితులు అందుబాటులో ఉన్నారు. వేద పాఠశాలను అత్యధునాతన టెక్నాలజీతో విశాలమైన స్థలంలో నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా వేద పాఠశాలను నిర్మించాలని గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.



చదువుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు అందుబాటులో నాలుగు వేదాలు..

రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో నలు గురు వేద పండితులు నాలుగు వేదాలను అందిస్తున్నారు. ఋగ్వేదం శాఖల శాఖ 10 సంవత్సరాలు, యజుర్వేదం కృష్ణ యజుర్వేదం 11, 12 సంవ త్సరాలు, సామవేదం కౌథురశాఖ 10 సంవత్సరాలు, అధ ర్వణవేదం శౌనఖ శాఖ 5,6 సంవత్సరాల పాటు చెప్పపడుతుందని అధికారులు తెలిపారు. స్మార్తం 4 సంత్సరాలు ఉంటుందని, వేదం, ఆగ మం, సంస్కృతం విద్యార్థు లకు బోధిస్తున్నట్లు తెలిపారు. వేద గణితం, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.




వేదపాఠశాలలో విద్యార్థులు

ఆర్మేనియా, రష్యాలో

ఉద్యోగాల పేరిట మోసం

- గల్ఫ్ ఏజెంట్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, జూలై 24: ఆర్మేనియా, రష్యాలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన రుద్రంగి మండలం మానాల అడ్డబోర్ తండాకు చెందిన అజ్మీరా కిషన్ అనే గల్ఫ్ ఏజెంట్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గల్ఫ్ ఏజెంట్ కిషన్ తన ఇద్దరితో కలిసి ఆర్మేనియా, రష్యాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, లక్షల్లో జీతాలు వస్తాయని అమాయక యువకులను నమ్మిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మానాల గ్రామానికి చెందిన కోల కృష్ణం రాజు వద్ద ఉపాధి నిమిత్తం ఆర్మేనియా నుంచి రష్యా పంపిస్తానని నెలకు లక్ష జీతం వస్తుందని చెప్పి రూ. 4.50 లక్షలు వసూలు చేశాడు. ఇదే విధంగా పెగ్గర్లకు చెందిన రంజిత్ వద్ద రూ.7.50 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గరిపెల్లి శశిధర్ వద్ద రూ.6.50 లక్షలు, అంబారి పేట నరేష్ వద్ద రూ. 4.70 లక్షలు, ఆత్మకూరుకు చెందిన పుప్పాల సందీప్ వద్ద రూ. 7.50 లక్షలు, మర్రిమాడుకు చెందిన అమరకొండ అనిల్ వద్ద రూ. 4.30 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గుం టుక రాజేశ్ వద్ద రూ.2.50 లక్షలు తీసు కొని విజిట్ వీసాలు ఇచ్చి ఆర్మేనియా పంపాడు. అక్కడ 3 నెలలు ఉంచి ఎలాంటి పని చూపించకుండా వసతులు కల్పించకుండా మోసం చేశాడు.

బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టగా అజ్మీరా కిషన్, నేపూరి తిరుపతి, కాల్వ ఉమ మహేశ్ మోసాలకు పాల్పడినట్లు తేలిందని, ఇందులో అజ్మీర కిషన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ముగ్గురు కలిసి 60మంది యువకులను గల్ఫ్ పంపిస్తామని మోసం చేశారని, ఎవరైనా బాధితులు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోస పోవద్దని అన్నారు. ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గల్ఫ్ ఏజెంట్ల వివరాలు అవసరమైన యువకులు స్పెషల్ బ్రాంచ్ 8712656411కు ఫోన్ చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం..

ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, జూలై 24: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన చిక్కుడువానిపల్లె గ్రామానికి చెందిన కంకటి రవిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వల్లంపట్లకు చెందిన కీసరి నాగరాజు డిగ్రీ పూర్తిచేసి కిరాణం దుకాణం నడుపుకుంటున్నాడు. నాగరాజును కలిసిన రవి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.4 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని తరచూ ప్రశ్నించడంతో నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిర్యానీ సెంటర్‌లో

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత

జమ్మికుంట రూరల్, జూలై 24: పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల బిర్యానీ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత బుధవారం తనిఖీ చేశారు. హోటల్ లోని బిర్యానీ, చికెన్, మసాలలు, నూనె, అల్లం వెల్లుల్లీ పేస్టు, ఇతర సామగ్రిని ఆమె పరిశీలిం చారు. ఫ్రిజ్‌లో నిల్వ పెట్టిన చికెన్, ఇతర ఆహార వస్తువులు వినియోగదారులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. పలు శాంపిల్స్‌ను సేకరించి వెంట తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత మాట్లాడుతూ బిర్యానీ సెంటర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను తనిఖీలు నిర్వహించామని తెలిపారు. బిర్యానీ, బియ్యం శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తలనీలాల టెండర్లు వాయిదా



మల్యాల, జూలై 24: కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భక్తులు సమర్పించే తలనీలాలకు అధికారులు బుధవారం టెండర్లు నిర్వహిం చారు. ఏడాది కాలపరిమితికి సీల్‌టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా ముగ్గురు సీల్, 11మంది బహిరంగ వేలంలో పాల్గొన్నారు. అయితే అనివార్య కారణాలతో తలనీలాలు పోగు చేసే హక్కు టెండర్ వాయిదా వేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మరోసారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. అలాగే దేవస్థానం తరుపున పోగు చేసిన తలనీలాలకు కూడా అధికారులు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సీల్ టెండర్‌లో నలుగురు, బహిరంగవేలంలో 23 మంది డిపాజిట్ చేయగా 14 మంది వేలంలో పాల్గొన్నారు. ఇందులో కిలోకి రూ.8,500 శ్వేత రైస్ ఇండస్ట్రీస్ హెచ్చు పాటగా నిలిచింది. హెచ్చు వేలంను కమిషనర్‌కు నివేదిస్తామని తరువాత కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తామని అధికారులు తెలిపారు. వేలంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు అనిల్‌కుమార్, సునీల్ దేవస్థానం సిబ్బంది ఉమామహేశ్వర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, జూలై 24: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల, జూలై 24: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో ఉన్న బీఎస్సీ అగ్రికల్చర్ గురుకుల కళాశాలలో మౌలిక వసుతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ కార్యదర్శి ఐఏఎస్ అలుగు శ్యామలకు కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో సరైన ప్రొఫెసర్లు, కోర్సులకు సంబధించిన పరికరాలు లేవని తెలిపారు. పంటకు సంబధించిన స్థలం లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదన్నారు. తాగునీరు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ హెడ్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద గోదావరి ప్రవాహం

ధర్మపురి, జూలై 24: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం కొనసాగుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నదిలోకి నీరు చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం 5 గంటల వరకు కడెం ప్రాజెక్టులోనికి 6,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 2, 18వ నెంబర్ గేట్లు తెరచి 13,428 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. మూడు రోజుల నుంచి గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల మంగళిగడ్డ, సోమవిహార్, సంతోషీమాత ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులను నది వైపు వెళ్లరాదని మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది చర్యలు చేపట్టారు. వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రాయపట్నం వంతెన వద్ద కూడ ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 21,210 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 21,210క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 24.515 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 55.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 548 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 19.059 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.203 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 24: గంజాయి మొక్కలు పెంచి యువకులకు విక్రయిస్తున్న ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన జక్కనపల్లి వివేక్, ఇల్లంతకుంటకు చెందిన అంతటి వేణు, తంగళ్లపల్లికి చెందిన క్రాంతిని బుధవారం అరెస్టుచేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని మైలారం గ్రామానికి చెందిన వివేక్ ముస్కానిపేటలో నివాసం ఉంటూ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. తంగళ్లపల్లికి చెందిన క్రాంతి వద్ద గంజాయిని కొనగోలు చేస్తున్నాడు. ఈ మేరకు తంగళ్లపల్లిలోని అంబగుడి వద్దకు వస్తున్నారనే సమాచారంతో ముగ్గురు యువకులను పట్టుకొని విచారించారు. దీంతో గంజాయి విక్రయాలు వెలుగు చూశాయి. క్రాంతి తన ఇంట్లోనే గంజాయిని అక్రమంగా సాగుచేస్తూ విక్రయిస్తున్నాడు. వారి వద్ద గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సీఐ మొగిలి

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

సంగెం విద్యార్థి మృతి..



హర్షవర్ధన్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూలై 24 : హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడంతో కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన పోతుకూరి రవీందర్ రెడ్డి - స్వప్న దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాడు. కూతురు బీటెక్ పూర్తి చేయగా కుమరుడు హర్షవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ ప్రాంతంలో అనురాగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి తన స్నేహితునితో ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి కళాశాలకు వస్తుండంగా ఘట్‌కేసర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించారు. హర్షవర్ధన్ మృతదేహం బుధవారం రాత్రి సంగెం గ్రామానికి చేరుకోవడంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి. గురువారం హర్షవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 24: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన దుద్దుల రాజయ్య మోటర్ సైకిల్‌పై మానకొండూర్ వైపు వెళ్తున్నాడు. వరంగల్ వైపు వెళ్తున్న కారు తాడికల్ గ్రామ శివారులో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రాజయ్యను ఢీ కొట్టింది. దీంతో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేశవపట్నం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ధర్మపురి, జూలై 24: ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతి పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల రెసిడెన్సియల్ పురుషుల డిగ్రీ కళాశాలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో మానెనీ అంజలికుమారి, ప్రిన్సిపాల్ ఎలగొండ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో బీఏ (ఈపీహెచ్), బీకాం (సీఏ, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ బీజెడ్‌సీ ఇంగ్లీష్ మీడియం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువ పత్రాలతో ఈ నెల 31 వరకు కళాశాలలో చేరవచ్చని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచిత భోజన వసతి, పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందని వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే విద్యా బోధన, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమా చారం కోసం 8121149717, 8179407798, 7674905760 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రేషన్ కార్డుతో సంబంధం రుణమాఫీ లేకుండా చేయాలి

బీర్‌పూర్,జులై 24:రైతు రుణమాఫీని రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణాలు మాఫీ చేయాలని ఉమ్మడి సారంగాపూర్ మండలం మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు పంట రుణమాఫీ చేసే విషయంలో రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రైతు పట్టా పాసుపుస్తం ఆధారంగానే రుణ మాఫీ చేయాలని అన్నారు. రైతులు జీవనోపాధి నిమిత్తం కొంత మంది గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి పేర్లు రేషన్‌కార్డులో లేవని అటువంటి రైతుల నష్టపోయే అవకాశం ఉందని గుర్తు చేశారు. రేషన్ కార్డులో పేర్లు లేని రైతులకు రుణమాఫీ లిస్టులో పేర్లు రాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయం, బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

ఆదివాసీ నేత వర్ధంతి



వర్ధంతిలో పాల్గొన్న ఆదివాసీలు

రాయికల్, జూలై 24: రాయికల్ పట్టణంలో బుధవారం ఆదివాసీ నేత కురిసెంగ రామయ్య 25వ వర్ధంతి కొమురం భీం విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివాసి తోటి జాతి అభివద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కురిసెంగ వేణు, ఆదివాసి జేఏసీ నాయకులు ఆత్రం రవీందర్, మండల ఆదివాసీ నాయకులు ఆత్రం శేఖర్, నిర్మల్ జిల్లా నాయకులు చక్కటి రాజు, కురిసెంగ శ్రీను, ప్రసన్న కుమార్, పింద్రం లక్ష్మీనారాయణ, ఆత్రం చిన్నానంద్, ఆత్రం శంకర్, దినేష్, కాంగ్రెస్ నాయకుడు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

● పీఆర్టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి

సారంగాపూర్, జూలై, 24: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ ఎల్లవేలలా కృషి చేస్తుందని జిల్లాశాఖ అధ్యక్షులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయుటీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఉపాధ్యాయులకు ఎంఈవోలు, డైట్, జేఎల్‌లుగా ప్రమోషన్‌లు త్వరలోనే ఇప్పించేలా కృషి చేస్తున్నామని పెండింగ్‌లో ఉన్నటువంటి 5 డీఏలను 50శాతం ఫిట్మెంట్ ఇప్పిస్తూ పీఆర్‌సీ ప్రక్రియ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే 317 జీవోల జరిగినటువంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన ప్రసాద్, వీరబత్తిని రాజగోపాల్, బెజ్జంకి అనిల్ కుమార్, సారంగాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానేరు శంకరయ్య, సంగ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుంది

కొడిమ్యాల, జూలై 24 : క్రీడలతో విద్యార్థులకు శారీరక దారుఢ్యం పెరుతుందని ప్రదానోపాధ్యాయురాలు విజయేంద్ర అన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా స్పోర్ట్స్ డే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం పేరుతో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయురాలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పీడీ రాజమల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం

● కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం మరో మారు తెలంగాణ ప్రజలను మోసం చేసిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూనియన్ బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కేటాయించకపోవడం విచారకరమని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడి నాయకత్వంలో 2014 నుండి తెలంగాణకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంకు నిధులు కేటాయించాలని కోరినప్పటికీ నిధులు మంజూరు చేయలేదని అన్నారు. ఇప్పడికైన బీజేపీ తెలంగాణ రాష్ట్రంపై ఉన్న కపట ప్రేమ భయటపడిదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన పొలాస శాస్త్రవేత్తలు

కథలాపూర్, జూలై 24 : మండలంలోని దూలూరులో బుధవారం పొలాస వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్తలు వరి, మొక్కజొన్న, పత్తి, పసుపు పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించిన శాస్త్రవేత్తలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా వరిలో మొగిపురుగు నివారణకు కార్బొఫ్యూరాన్ 10జీ గుళికలు ఎకరానికి చల్లుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రజినీకాంత్ (సేద్యవిభాగం), డాక్టర్ బలరాం (తెగుళ్ల విభాగం), డాక్టర్ మధుకర్ (జన్యు విభాగం), డాక్టర్ స్వాతి (ఉద్యాన విభాగం), వ్యవసాయాధికారిణి యోగిత, ఏఈఓలు, రైతులు మీన్‌రెడ్డి, క్యాతం రవీందర్, దయ్యా రవి తదితరులు ఉన్నారు.

ఆషాఢం... గోరింటాకు సంబరం

జగిత్యాల టౌన్: ఆశాఢ మాసాన్ని పురస్కరిం చుకుని జగిత్యాల జిల్లా కేంద్రంలో జగిత్యాల బార్ అసోసియే షన్ న్యాయవాదుల సతీమ ణుల ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆషాఢమాస సంబరాల్లో భాగంగా చేతిలకు గోరింటాకు పెట్టుకుని వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు ఉన్నారు.

నేతకార్మికుడి ఆత్మహత్య



మల్లయ్య(ఫైల్)

పెగడపల్లి, జూలై 24 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ల్యాకవెంకయ్యపల్లిలో గుండేటి మల్లయ్య (55) అనే నేత కార్మికుడు బుధవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహ త్య చేసుకున్నాడు. గతంలో బతుకమ్మ చీరలు నేస్తూ జీవనం సాగించే నేత కార్మికుడు మల్లయ్యకు ఆరు నెలలుగా ఉపాధి లేదు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారి ఇంటిపక్కనే గల సాంచాల కార్ఖానాలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మల్లయ్య తన భార్య రాజేశ్వరితో కలసి చీరలు నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య కూలీకి వెళ్లిన సమయంలో సాంచాల కార్ఖానాలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుని భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సత్తయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

మెట్‌పల్లి, జూలై, 24: ఆసుపత్రిలో శానిటేషన్ నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను హెచ్చరించారు. బుధవారం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలోని చెత్త, దుర్వాసనతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. రేపటిలోగా చెత్తచెదారాన్ని, పనికిరాని స్క్రాప్‌ను తొలగించాలని శానిటేషన్ ఇన్‌చార్జిని ఆదేశించారు. ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు, వార్డు, ల్యాబ్, ఎమర్జెన్సీ వార్డు, ఐసియు, సిటీ స్కాన్, స్కానింగ్ రూమ్, ఎక్స్‌రే గదులతో పాటు మెడికల్‌లోని మందులు, రిజిస్టర్లు, వంట గది నిత్యవసరాలు, బియ్యం, కూరగాయలు తదితరాలను పరిశీలించారు. ప్రతి రోజు ఆసుపత్రికి వస్తున్న పేషెంట్ల వివరాలు, గర్భిణిల నమోదు, ప్రసవాలు, రోగులకు అందిస్తున్న సేవలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు, శుభ్రమైన మంచినీరు, భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమై పేషేంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్, మున్సిపల్ కమిషనర్ మోహన్, సూపరిడెంట్ సాజిద్ అహ్మద్, అమరేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.



మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బోగ శ్రావణి

ఇళ్లను కేటాయించిన తర్వాత క్వార్టర్స్ ఖాళీ చేయించాలి

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దరూర్ క్యాంపులో గల సీ టైప్ క్వార్టర్‌లో నివాసముంటున్న నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించిన తర్వాత ఖాళీ చేయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి సమస్యను విన్నవించారు. పట్టణంలోని 9వ వార్డులో గల దరూర్ క్యాంపు సీ టైప్ క్వార్టర్లలో దాదాపు 150 నిరుపేద కుటుంబాలు గత కొంతకాలంగా నివాసం ఉంటున్నాయన్నారు. రెండు రోజుల క్రితం ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారులు క్వార్టర్స్ ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకవస్తున్నారని వివరించారు. ఉన్న ఫలంగా ఇళ్లు ఖాళీ చేయాలంటే ఇబ్బందిగా ఉందని నిరుపేదలు ఆవేదన చెందుతుందన్నారన్నారు. క్వార్టర్స్ ఖాళీ చేయడానికి కనీసం సుమారు ఆరు నెలల గడువు ఇవ్వాలని, నూకపల్లిలో నిర్మాణమవుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల బీజేపీ నాయకులు రంగు గోపాల్, ఆముద రాజు, వీరబత్తిని అనిల్ కుమార్, గడ్డల లక్ష్మీ పాల్గొన్నారు.

తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

జగిత్యాలరూరల్ : ప్రతి గ్రామపంచాయతీలో ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల మండలంలోని ధరూర్ గ్రామంలో గల డంపింగ్ యార్డును, టీఆర్‌నగర్‌లో ఎనిమల్‌కేర్ సెంటర్‌ను ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎనిమల్ కేర్ సెంటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పొడిచెత్తను సెగ్రిగేషన్ షెడ్డు ద్వారా స్క్రాప్ డీలర్లకు అమ్మాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, మున్సిపల్ కమిషనర్ సమ్మ య్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలి

రాయికల్, జూలై 24: రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డిలు అన్నారు. రాయికల్ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కార్యవర్గ సమావేశం విశ్వకర్మ సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. రాష్ట్ర నాయకత్వ అడుగు జాడల్లో కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, జిల్లా నాయకులు ముత్యం రెడ్డి, తొగిటి లక్ష్మీనారాయణ, మహిపతిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కుంబోజు రవి, మహేష్, వాసం రమ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

మెట్‌పల్లి, జూలై, 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో, డీసీజెస్ కంట్రోల్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్‌లు సూచించారు. బుధవారం పట్టణంలో డెంగ్యూ మూడు కేసులు నమోదు కావడంతో వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. కాలనీల్లోని మురికి కాలువలు, ఇళ్లను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగింపజేయించారు. డెంగ్యూ బారిన పడిన వారు వైద్యుల సూచనలు తప్పకుండా పాటిస్తూ మందులు వాడుతూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమకాటు ద్వారా విషజ్వరాలు వ్యాప్తిస్తుంటాయన్నారు. ఇంట్లోని ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వ్యాప్తి చెందకుండా మొదటి దశలోనే అంతం చేసుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇండ్లల్లోని పాత వస్తువులు, టైర్లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా, ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన నీటిలో లార్వా ఏర్పడకుండా ముందుగానే గమనించి అంతం చేయాలన్నారు. సాధారణంగా దోమల బెడద తీవ్రంగా ఉంటుందని, పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచనలు చేశారు. వీరి వెంట వైద్యాధికారి సమీయోద్దీన్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కార్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మెట్‌పల్లిలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా పోచమ్మ బోనాల జాతర



పోతరాజులు, గ్రామ దేవతల వేశధారణలో విద్యార్థులు



మెట్‌పల్లిలో ఊరేగింపుగా మహాలక్ష్మీ ఆలయంకు వెళ్తున్న గంగపుత్రులు

కోరుట్ల, జూలై 24: ఆషాఢమాసం పురస్కరించుకుని పట్టణంలోని గ్రామ దేవతలకు వివిధ కుల సంఘాలు, పలు పాఠశాలకు చెందిన విద్యార్థులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోతరాజులు, గ్రామ దేవతల వేశాధారణలో బోనాల శోభయాత్రను నిర్వహించడం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. పంటలు బాగా పండి వర్షాలు బాగా కురిసి ప్రజల ఆరోగ్యం బాగుండాలని కోరుతూ మహిళలు బోనాల శోభయాత్రను నిర్వహించారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ కరస్పాడెంట్ నీలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు పోతరాజులు, గ్రామ దేవతల వేశాధారణలో బోనాల శోభయాత్రను నిర్వహించారు. శోభయాత్రలో విద్యార్థులు చేసిన నృత్యాలు పట్టణ ఆకట్టుకున్నాయి. మహాలక్ష్మికి బోనాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాయిబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో మహలక్ష్మికి బోనాలను సమర్పించారు. సంఘ మహిళలు మహాలక్ష్మి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశుమందిర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ బోనాలు

మెట్‌పల్లి: ప్రతి యేటా ఆషాఢంలో నిర్వహించే మహాలక్ష్మీ అమ్మవారి బోనాల పండుగను గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని పురవీధుల గుండా గంగపుత్రులు ఆలయంకు బయలు దేరారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా గంగపుత్రులు బోనాల నెత్తిన ఎత్తుకోని నైవేద్యం, గుల్లెండ్లతో డప్పుచప్పుల మధ్య ఆలయంకు ఊరేగింపుగా చేరుకున్నారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని అమ్మ వారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు జరపగా పురోహితుడు ప్రశాంత్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య పరిశ్రమ అధ్యక్షుడు పర్రె శంకర్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆర్మూర్ నరేందర్, పారిపెల్లి శంకర్, వాల్గొట్ సాయిలు, మర్రి పోచయ్య, మానుకల చిన్నయ్య, పారిపెల్లి రమేష్, ఆర్మూర్ రంజిత్, గంగారం, శివ, రాజు, పోచయ్య, రాజయ్య, గంగపుత్రులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత డిపోగా కోరుట్లను తీర్చిదిద్దుదాం

● ఎంవీఐ శ్రీనివాస్

కోరుట్ల, జూలై 24: ప్రమాద రహిత డిపోగా కోరుట్లను తీర్చిదిద్దుదామని ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కోరుట్ల ఆర్‌టీసీ డిపోలో డీఎం మనోహర్ ఆధ్వర్యంలో ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ డ్రైవర్లకు డ్రైవింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తను ఎంవిఐ వివరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ వారోత్సవాలు డిపోలు మొదటి రోజుల ప్రమాదహిత వారోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు వారం రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ రోజు శిక్షణ రోజు, మూడవ రోజు మెడికల్ ఎగ్జామినేషన్ రోజు, నాలుగవ రోజు ప్రైవేట్ హైయిర్ బస్ డ్రైవర్ రోజు, ఐదవ రోజు మోయింటనెన్స్ డే, ఆరవ రోజు ఫ్యామిలీ కౌన్సాలింగ్ రోజు, ఏడవ రోజు డ్రైవర్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్లు, మెకానిక్, కండక్టర్లు, సూపర్‌వైజర్ల్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ భూముల సర్వే చేపట్టిన అధికారులు

కోరుట్ల, జూలై 24 : కోరుట్ల పట్టణంలోని సర్వే నంబర్ 265లోని వక్ఫ్ బోర్డ్ భూములను బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే జరిపి హద్దులను నిర్ణయించారు. తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, రమ్య, మండల సర్వేయర్ కుమార స్వామి ఆర్ఐ రాజేందర్ రావులు సర్వే నిర్వహించారు. అనంతరం హద్దులను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



జగిత్యాలలోని వేడుకల్లో జడ్పీ మాజీ చైర్ పర్సన్, నాయకులు



మెట్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్, జూలై 24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే తారక రామారావు జన్మదిన వేడుకలను మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ప్రియాంక ప్రవీణ్, ఆసీఫ్, దేవేందర్‌నాయక్, శివకేసరి బాబు, ఆనంద్ రావు, మల్లేశం తదితరులు ఉన్నారు.

కొడిమ్యాల: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ 49వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు రాజేశం, స్వామి, వెంకటి, ఆనందం, లక్ష్మారెడ్డి, రత్నాకర్, తిరుపతి, బీరయ్య, రాకేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను మల్యాలలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ చౌరస్తా వద్ద కేకు కట్ చేశారు. అనంతరం ప్రాథమిక ఆసుపత్రిలో మామిడి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ మధుసూధన్‌రావు, నాయకులు దేవరాజం, కోటేశ్వర్‌రావు, అజర్, కొంక నర్సయ్య, జున్న సురేందర్, త్రినాథ్, బాలే సంజీవ్, చిన్నదుర్గయ్య, దశరథం, తిరుపతిగౌడ్, రాజేంధర్, రంజిత్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బరాజన్న ఆలయంలో బుధవారం మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను మాజీ సహకార సంఘం చైర్మన్ సాగి సత్యంరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ బల్మూరి నారాయణరావు, నాయకలు తేలు రాజు, బండారి వెంకటేష్, లింగారెడ్డి ఉన్నారు.

బీర్‌పూర్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, నాయకులు శీలం లింగన్న, రామచంద్రం పాల్గొన్నారు.

రాయికల్ : రాయికల్ పట్టణ, మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వర్తక సంఘంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, కౌన్సిలర్లు కాంతారావు, సువర్ణ, సత్యనారాయణ, శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, సాయి కుమార్, కన్నాక మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు కథలాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్యగంగాధర్, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, గంగం గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

కోరుట్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బట్టు సునీల్ నాయకులు ఫహీం, అన్వర్, జాల వినోద్, అతిక్, చిత్తారి ఆనంద్, నగేష్, యాటం కృష్ణ, గల్లె గంగాధర్, రహీం పాషా, వాసిక్, శ్రీనివాస్ రావు, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డిలు నాయకులతో కలిసి కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఓజ్జెల బుచ్చిరెడ్డి, అంగడి పురుషోత్తం, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, హరిచరణ్ రావు, అజిత్ రావు, రావు శ్రీనివాస రావు, అంకం సాగర్, రమేష్ రెడ్డి, అభిలాష్, గంగారెడ్డి, మధుకర్ రావు, అంగడి ఆనందం, నాంచారి రాజేందర్, సుధవేణి భూమేష్ గౌడ్, నర్సయ్య, ప్రభాకర్, సురేందర్ తదతరులు పాల్గొన్నారు.